# In Whom shall we Trust

**By CANDY. T** అనువాదము : పురుషోత్తము చౌధరి

విశ్వాసముయెవరిమీద నుంచవలసినదనే దాని విచారణ

(1936)

**Bellary Tract - బళ్ళారి కరపత్రము**

మనుష్యులు దేవుని యాజ్ఞలను మీరినందువల్లను అందరు పాపులై యున్నారనుటకు సందేహమేమిలేదు. గనుక సమస్త మనుష్యులయొక్క స్థితి కఠినమై యున్నది. యేమంటే వారికి పాపము వల్ల దేవుని కోపమున్ను అనేక విధములైన దుఃఖములున్ను కడపట నరక ప్రాప్తియున్ను కలుగును. మనుష్యుల అవస్థ యీలాగున నుంటే వారికి వుద్ధారమేలాగున కావచ్చును. యీదుర్గతి నుంచి యేలాగున తప్పించుకొనవచ్చును. వారేలాగున రక్షింపబడుదురు. యిది అన్నిటి కంటే శ్రేష్ఠమైన విచారణయైయున్నది. అయితే యీ కార్యమందు వుపేక్ష చేసినా లేక మోసపోయినా వారికి నిత్య కీడు సంభవించునని నిశ్చయించుకొని దీని విషయము పూర్ణముగా పరిశోధించవలసినది.

విశ్వాసముంటే మనుష్యుడు రక్షించబడునన్ని, విశ్వాసము వల్ల సమస్తమున్ను కలుగునని న్ని అనేకులు చెప్పుచున్నారు. యిది ఒక ప్రకారముగా నిశ్చయమే, సరి. యేలాగంటే విశ్వాసము సత్యమైతె మతిన్ని, వుత్తమస్థల మందు వుంచియుంటే మనుష్యుడు రక్షించబడును. అయితే ఆ విశ్వాసము అసత్యమైతే లేక అనుత్తమ స్థలమందు వుంచియుంటే వాడు యేలాగున రక్షించబడును? రక్షించబడకుండా మధ్యే నాశము పొందును. బహుజనుల విశ్వాసము అసత్యమై యుండుట వల్లనున్ను అనుత్తమ స్థలములయందు వుంచబడుటవల్లనున్ను వారు నాశము పొందుచున్నారు. యెవడైనా నదిని దాట నిచ్ఛయించితే మంచిపుట్టిని

చూచి కూర్చుండవలెను. గాని రంధ్రముగల దానిలో కూర్చుండి నట్టయితే నీళ్లు నిండి తాను మునుగును. అయితె యీ పుట్టివల్ల నేను దాటుదును. దీనిలో నాకు పూర్ణముగా నమ్మికయున్నదనుకొని యీలాగున అధిక విశ్వాసమువుంచితె తన విశ్వాసము తన్ను దాటించునా? లేదు. ఆ పుట్టికి రంధ్రము ముండినందున నీళ్లు నిండి నిస్సందేహముగా వాడు మునుగును. యెవడైనా నొకమార్గస్థుడు దారితప్పినట్టయితే వానినొక వుత్తముడు జూచి వో స్నేహితుడా, యిది నీకు దారిగాదు యిది అరణ్యము నకు పోవునని చెప్పగా, ఆమార్గస్థుడు వానితో నీవబద్ధికుడవు, యిదే నా మార్గము, యిందులో నాకు పూర్ణముగా నమ్మిక యుంది గనుక నీదారే పోదునని ప్రత్యుత్తరము చెప్పి పోతే వాడు చేరవలసిన స్థలమునకు చేరునా? వాని విశ్వాసము వాని చేర్చునా? మఱి యెవడైనా విషమును పుచ్చుకొని అది యమృతమని విశ్వసించి, దీనివల్ల నేను చావనని తాగితే వాడు బ్రతుకునా? వాని విశ్వాసము వాని బ్రతికించునా? ఇంకొకడు కేవలం దరిద్రుడైయుండి మఱియొక దరిద్రుని వద్దికి రూకలను వేడుకొనపోయి వాని వల్ల తనకు నిశ్చయముగా దొరుకునని విశ్వసించితే వానికి దొరుకునా? వాని విశ్వాసము వానికి రూకలను యిప్పించునా? మఱియెవడైనా రాజ దర్శనార్థముగా రాజనగరికి పోయ్యేటప్పుడు మార్గమందు నొక నీచుని చూచి యీ స్థలము యొక్క రాజితడే నిశ్చయముగా నితడే రాజనుకొని, వాని విశ్వసించితే తన విశ్వాసమువల్ల నా నీచుడు రాజౌనా? కాడు.

ప్రపంచ విషయమందు జనులు బుద్ధివంతులై యే కార్యమైనా చేయవలసితే ముందు వెనుక చూచి చేయుచున్నారు. గాని విచారించ కుండా యేదిన్ని చేయరు. సేవకుని వుంచుకొన్నట్టయితే వాడు యెక్కడివాడో, యేలాటి వాడో, మానస్థుడో, కాడో అని విచారించి వుంచుకొందురు. గాని పరిచయము లేనివాని నుంచుకొనడము లేదు. యెవడైనా సాహుకారివద్ద పైకముంచవలసితె వుత్తమునిగా నున్ను, నమ్మిక

గలవానిగా నన్ను చూచి వుంచును. గాని తుంటరి వద్ద వుంచదు. బుద్ధిలేని వారు మాత్రమే ప్రపంచ విషయమందు మోసపోవుచున్నారు. ఆత్మోద్ధారము విషయమై బుద్ధిమంతులు, మూర్ఖులుసహా మోసపోవు చున్నారు. యేలాగంటే వారు సంసారమందు మంచిదిన్ని, చెడ్డదిన్ని, వుపయోగమైనదిన్ని, అనుపయోగమైనదిన్ని మాత్రము విచారణ చేసి ధర్మ విషయమై యేమిన్ని విచారించకనున్నారు. యిది విహితము గాదు. దేవుడు మనుష్యులకు బుద్ధి నెందుకు యిచ్చినాడు. అది వారికి వుపయోగ మౌటకు యిచ్చెనుగదా. అయితే యెవరు దాని వ్యవహరించకుండా, దానివల్ల ప్రయోజనము పొందకుండా నుండుటవల్ల, గొఱ్ఱెల మంద విచారణ యేలాగుననున్నదో ఆలాగున మనుష్యుల విచారణ యున్నది. యేలాగంటె గొఱ్ఱెల మంద సేతువు మీద పోవుచునుండగా ముందుగా పోయ్యే గొఱ్ఱె సేతువుమీదనుంచి నదిలో దుమికితే దాని వెంబడి వొకటైనా నిలువకుండా అన్నిన్ని దుమికి నాశము పొందును. అదే ప్రకారముగా మనుష్యులు పెద్దలు యేలాగు చేసినారో ఆలాగు మనము చేయుదుమని చెప్పి నడుచుకొనుచున్నారు. అయితే పెద్దలు మంచిదాని చేసినారో, చెడ్డదాని చేసినారో దాని యెవరూ విచారించకుండా వారు మోసపోవుచు నుంటే వీరున్ను మోసపోవుచున్నారు. స్నేహితులారా, యీలాగున మీరు మోసపోకుండా మీ బుద్ధికి కలిగియుండే అంధకారమనే ముసుకును తీసివేసి దాని వుపయోగపఱచుకొనుడీ. అవివేకముచేతనున్ను, అవిచారణచేతనున్ను మీకుమీరే కీడును యెందుకు రప్పించుకొనుచున్నారు. అయ్యో, యెచ్చరికగానుండుండీ, జ్ఞానమందు యెచ్చరికగా నుండుడీయని మేము మిమ్ము వేడుకొనుచున్నాము. మీ విశ్వాసము యెవరిమీద నున్నదో యెటువంటి స్థలమందు వుంచియున్నదో దాని విచారణ చేయుడీ. యెందుకంటే మీ విశ్వాసము సత్యముగానుండి వుత్తమ స్థలమందు వుంచినట్టయితే అప్పుడు మీరు రక్షించబడుదురు. అయితే మీ విశ్వాసము అసత్యమైయుండి అనుత్తమ స్థలమందువుంచినట్టయితే మీకు కీడువచ్చును. వీటిని గురించి మనస్సుయందు నిస్సందేహముగా నిశ్చయించుకొనుడీ.

సత్యవంతుడు విచారణకు భయబడడు. అసత్యవంతుడు మాత్రమే భయపడును. సజ్జనుడు వెలుగునిచ్ఛయించుట వల్ల పగటియందు నడుచుట వానికి వుత్తమమై యున్నది. అయితే దొంగ పగలు దొంగతనము చేయకుండా రాత్రియందు చేయ వచ్చును. గనుక వానికి చీకటి ప్రీతిగానున్నది. మనలో యెవడిమీదనైనా తప్పు మోపబడియుంటే, వాడు యే యపరాధము చేయకనుంటే, విచారణకు భయపడక ముందుగా వచ్చి నన్ను విచారణ చేయుడీ యని చెప్పును. అయితే అపరాధము చేసినట్టయితే వాడు భయపడి వెనకదీసును.

ఇప్పుడు మీరు మీ విశ్వాసము వుత్తమస్థలమందు వుంచి యున్నదని మీకు తోచితే సంతోషకరమౌను అయితే విచారణ చేసిన పిమ్మట మీ విశ్వాసము అయోగ్యస్థలమందు వుంచియున్నదని మీకు తోచితే దానివల్ల అధిక ప్రయోజనము కలుగును. యేలాగంటే యీ ప్రకారమువున్నదని తెలిసి అయోగ్య స్థలమందుంచి యుండే విశ్వాసమును తీసి యోగ్యస్థలమందుంచవచ్చును. యెవడైనా అధిక రోగస్థుడై యుండి దాని తెలుసుకొనకుంటే ఆ రోగము వృద్ధై వాడు చచ్చును. అయితే రోగము వున్నదని తెలుసుకొన్నట్టయితే, వాడు వైద్యుని వద్దికి పోయి, ఔషధము పుచ్చుకొని స్వస్థపఱచుకొనును. యీలాగున మీ విశ్వాసము అసత్యమైతే విచారణ చేయకనుండినందువల్ల దాని తెలియక మీకు నాశము వచ్చును అయితే విచారణ చేసినపిమ్మట దాని తెలుసుకొని మీ విశ్వాసమును వుత్తమ స్థలమందుంచితే మీకు క్షేమము కలుగును.

ఈ దేశపు జనులు ముఖ్యముగా బ్రహ్మ, విష్ణు, ఈశ్వరాదుల మీద విశ్వాసముంచినారు. అయితే వారి మీద విశ్వాసముంచుటవల్ల రక్షిణ్యము కలుగునో, కలుగదో దాని విచారించ నవస్యమైయున్నది. యీ దేశస్థుల మతములనున్ను, దేవుండ్లనున్ను నిందించుచున్నామని యెవరూ తలంచవద్దు. నిందించేటందుకు మాకు ఇచ్ఛ లేదు. అయితే దేవుని వాక్యమందు విధించి యుండే మార్గమును తెలిపి మీకు జ్ఞాన ప్రబోధచేయ నిచ్ఛయించుచున్నాము. గనుక మేము నిందించుచున్నామని యెవరూ యెంచక, మేము చెప్పే మాటలు, సత్యమో అసత్యమో దాని

మీరు విచారించుడీ. మేము మా కల్పనమాటలను చెప్పకుండా మీ శాస్త్రపురాణముల యందు వ్రాసియుండే వాటిని మాత్రమే చెప్పుచున్నాము. యిప్పుడు మేము మిమ్మును వొకటిని అడుగుచున్నాము. బ్రహ్మ మొదలైన వారి మీద మీరు విశ్వాసముంచడమునకు వారు నిజమైన దేవుండ్లై యున్నారో కాదో దాని యెప్పుడైనా విచారణ చేసియున్నారా. లేకుంటే, యిప్పుడు దాని అవస్యముగా చేయతగినది. నిజమైన దేవునికి ముఖ్యమైన కొన్ని లక్షణములున్నవి. అవి యేవంటే ఆయన అతిశుద్ధ పరమ పవిత్రముగలవాడై కించిత్పాపమైనా సహించకుండా దాని అధికముగా అసహ్యించుచున్నాడు. దీనికి అనుమానము కొంచమైనాలేదు. అయితే యెవనియందు యీలాటి లక్షణములుండవో వానియందు నిజము వుండదని తెలుసుకొనవలసినది. యీ లక్షణములు మనస్సందు వుంచుకొని యిప్పుడు బ్రహ్మ మొదలైన వారిని విచారణ చేయుదము. బ్రహ్మ విషయముగా మీ శాస్త్ర మందు వ్రాసియుండేదేమంటే వాడు పార్వతిని మోహించినందున, శివుని చేత శిరస్సు ఖండించబడి, ఋషి శాపగ్రస్తుడైయుండుటవల్ల నెవరూ తన్ను పూజ సేయకనున్ను, తన నామమును వుచ్చరించకనున్ను, తనకు గుడికట్టకనున్ను వున్నారని వ్రాసియున్నది. కాబట్టి వాని మీద యెవరైనా విశ్వాసముంచడమేలాగు. విష్ణు విషయముగా విష్ణుపురాణమందు చెప్పియున్నదేమంటే శత్రులను జయించుటకొరకై దశావతారములెత్తి అనేక వంచనలు, అబద్ధములు, దుష్క్రియలు మొదలైన వాటి చేత వర్తించి నాడని చెప్పియున్నది. అయితే నిశ్చయమైన దేవుడు వంచననైనా, అబద్ధమునైనా, జారత్వమునైనా తానుజరిగించ కనున్ను, దాని సైరించకనున్ను వుండుటవల్ల విష్ణువు నిజమైన దేవుడని చెప్పడముయేలాగు. శివుని విషయముగా శివపురాణమందు చెప్పిన దేమంటే వానికి రుద్రుడు, భయంకరుడు, సంహారకుండనే పేరులు గలిగేవాడు. కపాలమాలికను ధరించుకొని, శ్మశానమందు దిగంబరుడై నాట్యముచేసీనాడని చెప్పియున్నది. మరిన్ని లింగపూజ యేలాగు స్థాపించబడును ? అదియేలాగంటె, భృగువు శాపము వల్ల శివునికి

తెగిపోయిన లింగము దేవుడని నియమించబడి యున్నది. దీని పూర్వోత్త రము విస్తరించివ్రాయకూడదు. యింత అమంగళమైన మాటలు క్రీస్తుని భక్తులలో యెవడైనా వుచ్చరించేటందుకు మిక్కిలీ సిగ్గుపడును. యీలాగున నుండగా, శివుడు నిజమైన దేవుడనడము యేలాగు. అయ్యో, మీబుద్ధి విపరీతమై మీ సిగ్గు యేమైపోయినది. దీని విచారణము పూర్ణముగా చేయతగినదిగదా. యిదినిజమైన దేవునికి యోగ్యమో, అయోగ్యమో, తెలుసుకొనుడి. లింగపూజచేసుటవల్ల సిగ్గుయెక్కువౌనా, తక్కువౌనా. యీలాటి దాని వల్ల పాపము నివారణమౌనా లేక వృద్ధి బొందునా. ఓజనులారా, యీపూర్వోత్తరమును మనసుకు తెచ్చుకొనుడీ యని నేను మిమ్ము వేడుకొనుచున్నాను. మీకు యిది మంచిదిగానున్ను, దేవునికి తగినదిగానున్ను అగుపడితే అప్పుడు శివునియందు విశ్వాసముం చవచ్చును. చెడ్డదిగానున్ను, అయోగ్యముగానున్ను అగుపడితె వానిమీద విశ్వాసముంచడమేలాగు.

ఈ సకల వృత్తాంతములు మీ శాస్త్రములలో వ్రాసియున్నవి గాని, మాకల్పనల చేతయేమిన్ని చెప్పినదిలేదు. వీటి నన్నిటిని మీ మనసుకు తెచ్చుకొని, అవి నిజమైన దేవుని లక్షణములకు విహితమో, అవిహితమో దాని విచారించుడీ.

కొందరు అవతారములయందు చేసిన దుష్కృత్యములు పాపమని చెప్పకూడదనుచున్నారు. అయితే యిది యేలాటిమాట పాపము యేమియున్నదో అది యెవరు చేసినా పాపమే. రాజాధి రాజైయుండి బలాత్కారముచేత యింకొకని వస్తువుల నపహరించితే అతడు చేసినది చెడుదిగాదని యనవచ్చునా. మఱి వొకనిని చంపితే అతడు హత్యచేయలేదని చెప్పవచ్చునా. మీరుయీ కార్యముల విషయముగా విచారించితే మీరు గ్రహించవచ్చును. బుద్ధివంతుడు దుష్కార్యములను చేసితె వాని పాపము అధికముగా నుండును. బుద్ధిహీనుడు

అదేకృత్యమును చేసితే వాని పాపము బుద్ధివంతుని పాపమున కంటే తక్కువగానుండును. చిన్నవాడు చెడుదిని చేసితె వానికి దోషముకలుగును. అయితే పెద్దవాడు దాని చేసితే చిన్నవాని పాపము కంటే వాని పాపము యెక్కువగానుండును. యధారాజ తథా ప్రజః అని చెప్పి యున్నది. అది యేమంటే రాజు శ్రేష్ఠుడు గనుక అతడేమి చేయుచున్నాడో దానివలనే సమస్తమైనవారు వర్తించుదురు. అతడు వుత్తముడైతే అందరు ఆలాగున నుందురు. అతడు చెడు దాని చేసితే అందరూ ఆలాగున చేయుదురు. తండ్రి వలెనే కొడుకులున్ను, యజమానుని వలెనే సేవకులున్ను నడుచుదురు. యీ ప్రకారముగా యథా దేవ తథా భక్తః అనేది సత్యమైనది. పిల్లకాయ తన తండ్రి నడతనుజూచి దాని వలె నడుచును. భక్తుడు తన దేవుని చర్యలను విని వాటివలెనే సేయనిచ్చయించును. లేకుంటే తాను నిజభక్తుడు గాడు. యెందుకంటే యిది నిజభక్తుని లక్షణమనేదాని విషయముగా కృష్ణుడుతానే వుపదేశించియున్నాడు. భగవద్గీతయందు మూడో అధ్యాయము యిరువయో శ్లోకమందు వ్రాసినదేమంటే **"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేత రోజనః సయత్ప్రమాణంకురుతే లోకస్తదనువర్తతె".**

ఈ శ్లోకాభిప్రాయమేమంటే శ్రేష్ఠులు యేదేది ఆచరించుదురో, అది యితర జనులు ఆచరించుదురు. ఆ శ్రేష్ఠులుయేది ప్రమాణమని చేయుదురో, దానివలెనే లోకులున్ను చేయుదురని యున్నది. యిది నిజమే. సరి, వాడు దేవుడైయుంటే అధికముగా వుత్తమమైనవాటిని చేసును. సత్యము విడిచి సత్యముగా నడిచితే భూలోకము పాపము చేత నింపబడియుండును. గనుక కృష్ణుడు చెప్పిన వాక్యమును మనసుకు తెచ్చుకొని దాని విచారణ చేయుదము. అతడు నిజమైన దేవుడో, కాడో దాని చూడవలసినది. మిమ్ము మేము వొకటి అడుగుచున్నాము. దేవుడు చోరత్వమును చేసి, అబద్ధమునాడితే చోరులున్ను, అబద్ధికులన్ను అతనికి భయపడుదురా? భయపడరు. దేవుడు అందరికిన్ని న్యాయము తీర్చువాడైయున్నాడు. అయితే తానే పాపిష్ఠుడై యుంటే పాపులకు

న్యాయముతీర్చి వారిని యేలాగున శిక్షించును. కాబట్టి యెవని యందుపాపమువున్నదో వాడు నిజమైన దేవుడని అనకూడదు. యిది సమస్తమైన వారు వొప్పుకొనతగినది. అందువల్ల బ్రహ్మ మొదలైన వారియందు పాపముండినందున వారి మీద విశ్వాసముంచడమేలాగు. పాపిష్ఠులను రక్షించేటందుకు వారు యే ప్రయత్నమును చేయలేదు. తామే పాపులై యుండుటవల్ల తమకు రక్షకుడు కావలిసియుండగా యితరులను యేలాగున రక్షించుదురు. మీరు యెవరి మీద విశ్వాసముంచవలెనో దాని విచారించితే యిప్పుడు చెప్పుదుము. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు జగద్రక్షకుడై యుండుటవల్ల అతని యందు పూర్ణముగా విశ్వాస ముంచడము అవశ్యమైయున్నది. అతని మీరు విశ్వసించయోగ్యుడై యున్నాడనే టందుకు తెలియతగిన అతని చర్యలేమంటే. - దేవుడు ఆదియందు స్త్రీ పురుషులిద్దరిని పవిత్రులుగా నిర్మించెను. వారు స్వభావ మందు పాపేచ్ఛరహితులై సౌఖ్యముగా నుండిరి. అయితే వారు దేవుని యాజ్ఞమీరినందున, పాపులై, తమ పవిత్రతను పోగొట్టుకొని, స్వభావము వ్యతిరేకమై యపవిత్రులైరి. అదివరనుంచి వారు దేవుని యాజ్ఞలనను సరించ నశక్తులై పాపేచ్ఛతగిలి వారిద్దరు పాపమందు వర్తించిరి. ఇది గాక వారి సంతతైన యీ పృధ్వి యందుండే సమస్తమైన వారు జన్మదారభ్య పూర్ణపాపులై, యపవిత్రస్వభావము గలవారై, పాపేచ్ఛగలవారై యున్నారు. వారిద్దరి యొక్క పాపమునిమిత్తము భూమి పాపబరితమై అందరున్ను నరకమునకు యోగ్యులైరి. అయితే జనులు పాపులైనందున కేవలం అశక్తులై, అజ్ఞానులైయున్నారనే దానిన్ని, వారివల్ల యోగ్యపశ్చాత్తాప మయినా, పాపమునకు బలియైనా, పుణ్యమైనా చేయకూడక వుపాయ రహితులై యున్నారనే దానిన్ని దేవుడు తెలిసి వారిమీద దయచేసి వారిని రక్షించేటందుకు తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తును పంపిం చేటందుకు నిర్ణయించెను. మనుష్యులకు కొడుకులేలాగున నున్నారో దేవునికి యేలాగుననున్నారని తలంచవద్దుడీ. దేవత్వమందు త్రయైకత్వమువున్నది. యేలాగంటే పితా, పుత్ర, పరిశుద్ధాత్మ యనడమే. యీత్రయైకత్వము

వొకడే దేవుడైయున్నాడు. పితానిర్మాణికుడైయున్ని, పుత్రుడు జగద్రక్షకుడైయిన్ని, పరిశుద్ధాత్మ మనుష్యుల అపవిత్రమైన మనస్సులను పవిత్రము చేసి, దేవుని వాక్యమును వారి హృదయ ములలో ప్రవేశింప చేసి, ముద్రించి జ్ఞానమును పుట్టించే వాడైయిన్ని యున్నాడు. నియమించిన కాలమందు దేవునికుమారుడైన యేసుక్రీస్తు యెహూదియాలో కన్నెక గర్భమున వుదయించెను. అతడు మనుష్యులవలె పుట్టినవాడు కాడు. దేవుని ప్రభావమువల్ల పుట్టెను. జన్మదారభ్య అతడు పూర్ణ పవిత్రము గలవాడై మనుష్యుల వలెనే జీవ శరీర స్వభావములను ధరించి, హెచ్చుతక్కువగా ముప్పదిమూడు సంవత్సరములు జగతియందు వాసముచేసెను. ముప్పది సంవత్సరముల వయసుగలవాడైన పిమ్మట ప్రసిద్ధిబొంది, వుపదేశించనారంభించి, ముఖ్యమైన పన్నిద్దరు శిష్యులను కూర్చుకొని, గ్రామ గ్రామములలో సంచరించుచు, సత్యపరుడై, కపట, యుద్ధ, హింస, నింద మొదలైన వాటిని చేయక నందరికి హితకరుడై యుండెను. కుంటి వాడ్లు, గుడ్డి వాండ్లు, చెవిటి వాండ్లు, మూగ వాండ్లు, జ్వరగ్రస్తులు, భూతగ్రస్తులు వీరు మొదలైన రోగులు అతని వద్దికి వచ్చినంతనే వారిని స్వస్థము చేసి, దుఃఖముగలవారందరిని పరామర్శించెను. అదిగాక దేవుని న్యాయప్రమాణములను గైకొన మనుష్యులకు అసాధ్యమని వారికి ప్రతిగా తాను సకలమునంగీకరించి, సత్కర్మము వల్ల వారినిమిత్తము మితిలేని పుణ్యమును సంపాదించి, పాపమునకు తగిన ప్రాయశ్చిత్తము కలగవలయునని తన ప్రాణమును బలిగా నర్పించెను. నా ప్రాణమును నాలో నుంచి తీసుకొని పొయ్యేవాడెవడూలేడు, నేనే దాని యిచ్చుచున్నాను, దాని యివ్వడమునకున్ను, తిరిగిపుచ్చుకొనడమునకున్ను నాకు అధికారమువున్నదనిన్ని, మనుష్యునికుమారుడు దుష్టులచేతికి వొప్పగించబడును, వారు అతని చంపుదురు, అతడు చంపబడిన మూడవ దివసమందు తిరుగా లేచుననిన్ని, తన శిష్యులకు చెప్పినట్టే తానే తన శత్రులకు స్వాధీనుడై, వారిచేత చంపబడెను. పూడ్చినతర్వాత లేచి నలుభైదినముల పరియంతరము, మోక్షరాజ్యము

యొక్క విషయమై వాటిని చెప్పి, తన శిష్యులతో నుండి, అటు తర్వాత పరలోకమునకు పొయ్యేసమయమందు, వారితో - మీరు నా శుభసమాచారమును సమస్తమైనవారికి తెలియచేయుడీ, యెవరు విశ్వసించి బాప్తిస్మమును పొందునో వారు రక్షించబడును, అయితే యెవడు విశ్వసించక నుండునో వారు నరకాగ్నికిలో బద్ధవాడౌనని యాజ్ఞపించి చనెను. యిప్పుడెవరు తమమనస్సుయందు నిజమైన పశ్చాత్తాపముపడి పాపమునసంహించి, రక్షకుడైన క్రీస్తు ననుసరించుదురో వారు రక్షించబడుదురు. దేవుడు వారి పాపములంతా యతని పరిముఖముగా క్షమించి, వారి యపవిత్రమనస్సును పరిశుద్ధాత్మ చేత పవిత్రము చేసుటవల్ల, పాపాపేక్షవిడిచిపోయి దేవుని వాక్యము మీద ప్రీతిగలవారై, సకలసత్క్రియలను గైకొని నడిచి, యిహమందు సమాధానమును పొంది, పరమందు నిత్యానందముననుభవించుదురు. కాబట్టి స్నేహితులారా, మీకు దుఃఖము నరకము ప్రాప్తించ కుండా సుఖమునున్ను, దేవుని కృపనున్ను పొందనపేక్షితులైతే, నిష్ప్రయెజనములైన విగ్రహములను విస్మరించి, దేవుని కుమారుడైన యేసుక్రీస్తు మీద మనఃపూర్వకముగా విశ్వాసముంచండి. యెందుకంటే అతనికి నిజదేవుని లక్షణములు వుండినందువల్లనున్ను, అతడు మిమ్ము వుద్ధరించ తన ప్రాణమునర్పించి నందువల్లనున్ను మీరు అతని మీద విశ్వాసముంచుటకు యోగ్యుడై యున్నాడు. ఆహా యతని అంతఃకరణయున్ను, ప్రీతియున్ను యేలాటివని మీరు తెలిసి మీపాపము నిమిత్తము పశ్చాత్తాపపడి, దాని అసంహించి, యతనికి శరణాగతులై, పూర్ణవిశ్వాసమువల్ల నతని సభలో చేరి, యతని సర్వాజ్ఞలను గైకొని, యతని మార్గమందు నడవవలసినది గదా. అవును యెందుకంటే అతడు వొకడే గాక యితర రక్షకుడు యెవడు లేడు, గనుక నతని విశ్వసించే వాడు మోసపోకుండా రక్షింపబడును. అయితే యతని విశ్వసించనివాడు నిశ్చయముగా నాశముపొందును. యేసుక్రీస్తుని సభవారు నడవదగిన నీతి న్యాయ ఆచరణలు మొదలైనవాటి నంతా సమస్తమైనవారు చదివి తెలిసి, యతనియందు విశ్వసించి రక్షిణ్యమును

పొందేటట్టు, యతని శుభసమాచారము సమస్త భాషలలలో భాషాంత్రము చేయబడి యున్నది. దీని విషయము బళ్లారియందైనా, బెంగుళూరి యందైనా, బెల్గామందైనా, కడపయందైనా, విశాఖపట్టణమందైనా యీ శుభసమాచారము ప్రసిద్ధి చేసే బోదకుల వద్దికి యెవరైనా పోయి విచారించితే వారికి వివరించబడును. యేసుక్రీస్తుసభలో చేరినట్టయితే టోపియునైనా, అంగీయునైనా, ధరించవలయునని కొందరికి తోచు చున్నది. మఱి కొందరు మద్యపానముచేసి, మాంసము భక్షించ వలయు నని తలంచుచున్నారు. అయితే వారు వీటిని గురించి తెలియకనున్నారు. ఈలాటి నియమములు లేనేలేవు. టోపి వేయడములోనున్ను, పాగ చుట్టడములోనున్ను యేమిలేదు. వారి చిత్తము చొప్పున టోపియునైనా, ముండాసయునైనా రుమాలయునైనా ధరించుకొనవచ్చును. యివి అల్పకార్యములై యుండుటవల్ల వీటిని గురించి యేయాజ్ఞయున్ను లేదు. అయితే పాపవిమోచనమున్ను, ఆత్మరక్షణమున్ను యేలాగున పొందవచ్చునో, నరకమునుంచి తప్పించుకొని దేవుని సన్నిధానమందు సౌఖ్యమైన స్థలము యేలాగున సంపాదించ వచ్చునో, యివి ముఖ్యమైన కార్యములై యుండి నందున, వీటిని గురించి మాత్రమే క్రీస్తు శుభసమాచారమందు నాజ్ఞలున్నవి. అవశ్యముగా మద్యపానము చేయవలసిన దిన్ని, మాంసభక్షణ చేయవలసినదిన్ని వ్రాసి యుండలేదు. అయితే దేవుడు యేయే పదార్థమును నిర్మించినాడో అవంతా వొక్కొక్క విషయములో నుత్తమములైయుండుటవల్ల యెవడికి మాంసమును భక్షించనిష్టమున్నదో వాడు దేవుని స్తుతించి యతని యుపకారమును తలంచుకొని భక్షించితే దోషమేమిలేదని వ్రాసియున్నది. అయితే యీ విషయమందు యెవనికి సందేహమున్నదో వాడు భక్షించకూడదు. సందేహమైయుండేటప్పుడు యెవడు భక్షించుచున్నాడో వానికి దోషము ప్రాప్తించును. శుద్ధమనస్సు వల్ల సకల కార్యములను చేయవలసినది. అయితే పాపోన్మత్తులైన వారిమీద దేవుని కోపము కలుగును, గనుక వారు పరలోకమునకు చేరక నరకములో త్రోయబడుదురని వ్రాసియున్నది. భక్షించేది, పానము చేసేది అల్పమైన

కార్యములై యుండుటవల్ల సమస్తమైన వారు వీటిని గురించి నిరాటంకులై యున్నారు. యెవడు యేసుక్రీస్తుసభలో చేరునో వాడు తన సకల పాపములను త్యజించి, పాపమునకు తగిన పశ్చాత్తపపడి, రక్షకునిమీద యేకాగ్రతగా విశ్వాసముంచి, యతనికి భయభక్తితో నడుచుకొని, సమస్తమైన వారి యొక్క క్షేమమునపేక్షించి, యందరికి హితవుగా నడువవలెనని యాజ్ఞాపించియున్నది. యివి ప్రముఖముగానున్ను, జీవము గలిగినవి గానున్నున్నవి. నా ప్రియమైన స్నేహితులారా, యిప్పుడు సత్యమున్ను అసత్యమున్ను తెలియజేసి, మీరు విశ్వాసముంచదమునకు యెక్కడ విహితమో, యెక్కడ అవిహితమో దాని వివరించినాము. మఱిన్ని నిత్యజీవమునకు, నిత్యకీడుకు కొంచపొయ్యే మార్గమును మీకు అగుపఱచు చున్నాము. కాబట్టి యీ వుత్తమ కాలమందు మీరు యెవరిననుసరించి సేవించవలెనో దాని నిశ్చయించుకొనుడి. పితా, పుత్ర, పరిశుద్ధాత్మయనే త్రియేకదేవుడు నిజమైన దేవుడైయున్నాడని మీకు నగుపడితే అతని అనుసరించి విశ్వాసముతో విధేయులైయుండిడీ. అయితే మీరు యీపుస్తక మందుండే వృత్తాంతమువల్ల బ్రహ్మయిత్యాదికులు సత్యమైన దేవుడ్లైయున్నారని మీకు నగుపడితే వారిని నమ్మవచ్చును. అయితే మీరు అహంకారము చేతనున్ను, కోపముచేతనున్ను గాక మనోతాళిమిచేతనున్ను, నిదానముచేతనున్ను యీవిశ్లేషమైన కార్యములను గురించి విచారించి నిశ్చయించుకొనుడని మిమ్ము వేడుకొనుచున్నాను. మన తండ్రియైన దేవుని ప్రేమయున్ను, రక్షకుడైన యేసుక్రీస్తు కృపయున్ను, పరిశుద్ధాత్ముని సహవాసమున్ను మీకందరికీ కలుగుగాక. ఆమెన్.

* * *

స్నేహితులారా, మన రక్షకుడైన యేసుక్రీస్తు ఉపదేశించిన వాటి యందు మీరు కొంత చదివి యతడు యెంత ఉత్తముడైనదిన్ని అందరు నతనియందు విశ్వాసముంచ యెంతయోగ్యుడైనదిన్ని తెలుసుకొనుడి. యెహోవాయనే నీదేవుని నీపూర్ణహృదయ మువల్లనున్ను, నీ పూర్ణ ఆత్మవల్లనున్ను, నీపూర్ణమనుస్సువల్లనున్ను, స్నేహించుమనేయాజ్ఞ ముఖ్యమైనదిన్ని, మొదటిదైన దిన్నిగానున్నది. నీ సమానముగా నీ పొరిగింటివాని స్నేహించుమనే రెండవ యాజ్ఞదానివలెనే యున్నది. ఈ రెండాజ్ఞలలో న్యాయ ప్రమాణమం తానున్ను, దీర్ఘదర్శులవాక్యమున్ను సంక్షేపించియున్నది. దేవుడు ఆత్ముడైయున్నాడు. అతని యారాధించే వాడు ఆత్మతోటిన్ని, సత్యముతోటిన్ని యతని యారాధించవలసినది. నీతిపారకులయొక్క పరిశయులయొక్క నీతికంటే మీ నీతియధికముగా నుంటేగాని మీరు మోక్షరాజ్యములో ప్రవేశించనేరరు. మనుష్యులు మీసత్క్రియలను చూచి, పరలోకమందుండే మీ తండ్రిని స్తుతించేకొరకు, వారి ముందర మీవెలుగు ప్రకాశించనీయుడి. మీ మాట అవును అంటే అవును, కాదు అంటే కాదు అని వుండని. యేది దీనికంటే యెక్కువగా నున్నదో అదిచెడుదాని నుంచివచ్చును. యెవడైనా వొక స్త్రీని కామ భావముగా దృష్టించిచూచితే తన హృదయమందు దానితో కూడా జారత్వము చేసినవాడౌను. నోట్లో ప్రవేశించేది మనుష్యుని అశుచిచేయదు. అయితే నోట్లోనుంచి బయటకువచ్చేది మనుష్యుని అశుచి చేసును. నోట్లోనుంచి బయటవచ్చేదంతా హృదయములోనుంచి వచ్చును. యివే మనుష్యుని అశుచిచేయుచున్నవి. యెందుకంటే దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్షములు, నిందలు హృదయములో నుంచి బయటవచ్చుచున్నవి. మనుష్యుని ఆశుచిజేసేవి యివే. భూలోకమందు మీకు ధనాదులను సంపాదించి యుంచవద్దుడి. ఇచ్చుట చిమ్మెటయున్ను తుప్పుయున్న చెఱుపుచున్నవి. యిచ్చుట చోరులు కన్నమువేసి దొంగిలించుదురు. అయితే

పరలోకమందు మీకు ధనమును సంపాదించి యుంచుకొనుడీ. అచ్చట చిమ్మెటయైనా తుప్పుయైనా చెఱుపవు. అచ్చట చోరులు కన్నమువేసి దొంగిలించరు. నీవు ధర్మముచేసేటప్పుడు నీ ధర్మము అంతరం గముగా నుండేటందుకు నీకుడిచెయ్యిచేసేది నీ యెడమ చెయ్యికి తెలియకుండా నుండని. నీవు ప్రార్ధన చేసేటప్పుడు నీగదియందు ప్రవేశించి, నీతలుపు మూసుకొని, అంతరంగమందుం డే నీ తండ్రిని ప్రార్ధించు. అప్పుడు అంతరంగమందు చూచే నీతండ్రి నీకు బహిరంగ ముగా ఫలమునిచ్చును. యిరుకువాకిలి గుండా ప్రవేశించుడి. యెందుకంటే నాశమునకు పొయ్యేవాకిలి వెడల్పున్ను, దోవ విస్తారమున్ను కలిగియున్నది. దానిలో ప్రవేశించేవారు అనేకులు న్నారు. అయితే నిత్యజీవమునకు పొయ్యేవాకిలి యిరుకై, దోవదుర్గత మైయున్నది. దాని కనిపెట్టేవారు కొంచమై యున్నారు. మనుష్యుని కుమారుడు మనుష్యుల ప్రాణములను చెఱచేటందుకుగాదు, రక్షించేటందుకు వచ్చినాడు. మీరొ కరినొకరు స్నేహించుడి. నేను మిమ్ముయేలాగున స్నేహించినానో ఆలాగే మీరొకరికొకరు స్నేహించుడి. యెవడైనా పునాజన్మించితేగాని దేవునిరాజ్యమును చూడనేరడు. మీరు పశ్చాత్తాపపడక యుంటే మీరందరు నాశము పొందుదురు. యెవడుతన జీవమును రక్షించనిచ్ఛయించుకొన్నాడో వాడు దాని. పోగొట్టుకొనును. అయితే నానిమిత్తము తన జీవమును పోగొట్టుకొనేవాడు దాని రక్షించుకొనును. మనుష్యుడు జగదంతా నాదాయముపొంది తనజీవమును పోగొట్టుకొంటే తనకు ఫలమేమిలేక మనుష్యుడు తన జీవమునకు ప్రతిగాయేమియిచ్చును. యెందుకంటే మనుష్యుని కుమారుడు తన తండ్రిమహిమయందు తన దూతలతో కూడా వచ్చే వాడైయున్నాడు. అప్పుడు వొక్కొక్కనికి వాడు వాడు చేసిన కృత్యములచొప్పున ఫలమునిచ్చును. అయితే మనుష్యుని కుమారుడు తన మహిమయందు తన పరిశుద్ధ దూతలందరితో కూడా వచ్చేటప్పుడు తన మహిమగలసింహాసనము మీద కూర్చుండును. అప్పుడు సమస్తజనులు అతనిముందర కూర్చబడి, గొల్లవాడు

గొఱ్ఱెలను మేకలను వేర్పఱచేటట్టు, అతడు వారిని వేర్పఱచి గొఱ్ఱెలను తన కుడిపార్శ్వమందున్ను మేకలను తన యెడమ పార్శ్వమందున్ను వుంచును. అప్పుడు రాజు తన కుడిపార్శ్వ ముందుండే వారితో - నాతండ్రి చేత నాశీర్వదించబడిన వారలారా రండు, జగదోత్పత్తి ఆరంభ్యమునుంచి మీకు సిద్ధము చేయబడ్డ రాజ్యమును స్వతంత్రించుకొనుడనిన్ని, యెడమపార్శ్వమందు డేవారితో - శపించబడ్డవారులారా నన్ను విడిచి పిశాచమునకున్ను, వానిదూతల కున్ను సిద్ధము చేయబడ్డ నిత్యాగ్నిలో ప్రవేశించుడనిన్ని చెప్పును. అప్పుడు అనీతివంతులు నిత్యయాతనకున్ను, నీతివంతులు నిత్యజీవమునకున్ను పోవుదురు.